ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కర్ణాటక వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025

బీజేపీకి ఏటీ రామస్వామి గుడ్‌బై



బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా బీజేపీ నాయకులు ఏటీ రామస్వామి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు రాజీనామా లేఖ పంపారు. 2018 ఎన్నికల్లో జేడీఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఆ పార్టీ నేతలతో విభేధాలు రావడంతో తటస్థంగా ఉండేవారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. పర్యావరణంపై పోరాటాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలకే అంకితమవుతామని ఇటీవల ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే.



ఉపాధికి వచ్చి.. ఉన్మాదం..!



బెంగళూరుకు వస్తున్న వలస కార్మికులు (ఫైల్)

- నగరంలో కలకలం రేపుతున్న వరుస నేరాలు
- నిందితుల్లో అధిక భాగం వలస వచ్చిన వారే
- చిన్నారులపై లైంగిక దాడులు, మహిళల హత్యలు
- రాష్ట్రంలో 80వేల మందికి పైగా వలసజీవులే..
- నిర్మాణ, సెక్యూరిటీల్లో అధిక భాగం ఉత్తరాదివారు
- పేర్ల నమోదుకు సిద్ధమవుతున్న హోంశాఖ

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర రాజధాని బెంగళూరుకు వలసలు కొత్త కాదు. ఎన్నో ఏళ్ల నుంచి ఎంతో మందిని ఆదరించిన ప్రాంతంగా నగరానికి పేరు. రాష్ట్రాలు, దేశాల హద్దులు లేకుండా ఇక్కడికొచ్చి ఎంతో మంది జీవనం సాగిస్తుంటారు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ఐటీబీటీ, ఎంఎన్‌సీతోపాటు నిర్మాణరంగాలకు కూలీల డిమాండ్ భారీగా పెరిగిపోతోంది. యంత్రాల ద్వారా వేగవంతంగా పనులు సాగుతాయని అంటున్నా పర్యవేక్షణ కోసమైనా కార్మికుల అవసరం తప్పనిసరిగా ఉంది. ఇలా బెంగళూరు నగరంలోనే కాకుండా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్మాణరంగంలో వలస కూలీలదే హవాగా మారింది. రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. మైసూరు ప్రాంతంలో రిసార్టులు, చిక్కమగళూరు, శివమొగ్గ తీరప్రాంత జిల్లాల్లో కాఫీ, వక్కసాగు కోసం స్థానిక కూలీలు రావడం రాలేదు. దీంతో దశాబ్దాల కాలంగా తమిళనాడుతోపాటు ఉత్తరభారతీయులు వేలాదిమంది పనులకు వస్తుంటారు. ఇక బెంగళూరులో భిన్నమైన పరిస్థితి ఉంది. పదిమంది పనిచేసే ఆఫీసు నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కంపెనీలదాకా సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ విభాగాలు, వంట మనుషులంతా ఉత్తరభారతీయులే నిండిపోయారు. ఇలా వచ్చిన వలస కార్మికులతో స్థానికులకు పనిలేకుండా పోతోందనే విమర్శలే కాకుండా సంచలనమైన నేరాలకు వారే కారకులు కావడం కలకలం రేపుతోంది. ఐటీబీటీ రంగాల కంపెనీలు, పెద్దసంఖ్యలో ఫార్చ్యూన్ సంస్థలు ఉన్నాయి. పింఛనుదారుల స్వర్గధామంగానే కాదు అన్నివర్గాల వారికి అనుకూలమైన నగరం ఉంది. బెంగళూరు నగరానికి ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక జిల్లా వాసులే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల వారు సైతం జీవనోపాధికి వస్తున్నారు. కొవిడ్ తర్వాత ఇతర ప్రాంతాలనుంచి వలస వచ్చినవారి సంఖ్య అధికమైనట్లు తెలుస్తోంది. పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశ్శా సహా ఈశాన్య రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారు అధికమని అంచనా. రిటైల్ వ్యాపారం, భవన నిర్మాణం, పరిశ్రమలు, హోటల్ వర్కర్స్ వంటి పనులలో వలస వచ్చినవారు ఎక్కువగా కొనసాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలసవచ్చినవారు సహా 1.70 కోట్లమంది అసంఘటిత కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవలికాలంలో అధిక నేరాలలో ఉత్తరాది రాష్ట్రాలవారు నిందితులుగా ఉండడం ఆందోళన కలిగించే అంశంగా ఉంది.

ఇకపై కఠిన చర్యలు : హోంమంత్రి పరమేశ్వర్



ఇతర రాష్ట్రాలనుంచి బెంగళూరుకు వలస వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇకపై ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటాం. కార్మిక శాఖతో కలిసి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. వలస కార్మికుల్లో కట్టడ కార్మికులే అధికంగా నేరాల్లో బయట పడుతున్నారు. కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ సంస్థలు నిబంధనలు పాటించాలి. కార్మికుల పేర్లు తప్పనిసరిగా నమోదు చేయాలి

బయటపడిన నేరాల్లో కొన్ని..

మల్లేశ్వరంలో నేపాల్ యువతిని ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచి పరారైన వ్యక్తి ఒడిశ్శావాసిగా తేలింది. కోరమంగల పీజీ సెంటర్‌లోకి దూసుకెళ్లి కత్తితో అమానుషంగా దాడి చేసి హతమార్చిన ఘటనలో నిందితుడు ఉత్తరభారతీయుడనే సంగతి తెలిసిందే. హుబ్బళ్ళిలో ఇటీవల ఐదేళ్ల బాలికపై హత్యాచార ఘటనలో నిందితుడిపై పోలీసు కాల్పులలో బీహార్‌కు చెందిన రితేశ్ మృతి చెందిన సంగతి విదితమే. ఇలా సంచలనమైన నేరాలకు వలస కార్మికులే కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వందలాది నేరాలలో ఉత్తర భారతీయులే కారణమని రుజువైంది. ఇక నేపాల్ వాసులు ఇక్కడ నేరాలు చేసి రాత్రికి రాత్రి వారి దేశాలకు పరారీ అవుతున్నారు. అక్కడనుంచి వెనక్కి తీసుకురావడం పెను సవాల్‌గా మారుతోంది. నగరంలో వేలాదిమంది బంగ్లాదేశీయులు ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా మహదేవపుర, బన్నేరుఘట్ట ప్రాంతాలలో వారు నివసిస్తున్నట్లు తేలింది. ఇక నగరంలో డ్రగ్స్ వ్యాపారాలలో ఆఫ్రికన్ దేశస్తులు తరచూ పట్టుబడుతూనే ఉన్నారు. పాకిస్థాన్‌కు చెందినవారు ఇటీవల నగరంలో పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వచ్చే వేళ పేరు నమోదు చేసుకోవాలనే నియమం ఉల్లంఘనకు గురవుతోందన్న విషయం వెలుగు చూసింది.

నమోదయ్యింది కొందరే..

కేంద్రప్రభుత్వ ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వివరాల మేరకు 2025 మార్చి 25వరకు వలస కార్మికులు, గిగ్ కార్మికులు చేరి అసంఘటిత విభాగంలో 1,07,43,479మంది ఉన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి వలస వచ్చినవారు 79,653 మంది రాష్ట్రంలో ఉండగా వీరిలో 19,205మంది బెంగళూరులో ఉన్నారు. అయితే ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదైన సమాచారం మినహా ప్రభుత్వం వద్ద అధికారికంగా ఎంతమంది వలస కార్మికులు ఉన్నారనేది స్పష్టత లేదని కార్మికశాఖ సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. వలస వెళ్లే ముందు అక్కడి రాష్ట్రంలోనూ, వెళ్తున్న రాష్ట్రంలోనూ రెండుచోట్ల తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలనే నిబంధన ఉంది. అయితే ఈ నియమం పాటించడం లేదని తెలుస్తోంది. కాంట్రాక్టర్‌లు ఎక్కడెక్కడినుంచి కార్మికులను రప్పించి నిర్మాణ, వ్యవసాయ, తోటలు, నర్సరీ, ఫ్యాక్టరీలలో చేర్పిస్తుంటారు. ఇటీవల ఇతర అన్నిరంగాల్లోనూ వలస కార్మికులు అధికంగా కనిపిస్తున్నారు. నేరాలలో వలసకార్మికుల ప్రమేయంపై ప్రత్యేక సమాచారం లేదు. అయితే హత్య, దాడి, దోపిడీ, చోరీ, చెయిన్‌స్నాచింగ్, అత్యాచారం, అత్యాచారయత్నం వంటి కేసులలో వలసకార్మికుల భాగస్వామ్యం అధికంగా ఉందని సీనియర్ పోలీసు అధికారులు అంటున్నారు.

రాష్ట్రంలో వలసకార్మికుల వివరాలు

జిల్లా	సంస్థలు	కార్మికులు
బెంగళూరు నగర	215	19,205
బెంగళూరు గ్రామీణ	33	14,025
తుమకూరు	20	2,490
కోలారు	09	2,266
రామనగర	02	50
చిక్కబళ్ళాపుర	01	40
చామరాజనగర	03	780
మండ్య	10	1,109
మైసూరు	25	4,111
బిజాపూర్	06	468
బెళగావి	08	1,665
బాగల్కోట	01	48
గదగ్	02	1,054
ధారవాడ	32	5,431
హావేరి	04	90
ఉత్తరకన్నడ	-	-
బళ్ళారి	30	5,099
చిత్రదుర్గ	10	715
దావణగెరె	3	908
బీదర్	-	-
కలబురగి	8	1,209
కొప్పళ	37	8,252
రాయచూరు	30	3,518
యాదగిరి	21	1,905
చిక్కమగళూరు	12	820
హాసన్	7	1953
కొడగు	1	50
దక్షిణకన్నడ	15	696
శివమొగ్గ	1	70
ఉడుపి	11	1626



మట్టి పనుల్లో బిహారీ మహిళలు

ఏ ఏ రాష్ట్రాల నుంచి అధికమంటే..

బెంగళూరు సహా కర్ణాటకకు వలస వచ్చేవారిలో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, జార్ఖండ్, గుజరాత్, ఒడిశ్శా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల నుంచి అధికంగా కార్మికులు వస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో అత్యధికశాతం రిటైల్ వ్యాపారం, ఇంటి పనులు, హోటళ్ళు, గ్రానైట్, రబ్బర్ ఫ్యాక్టరీలు, కాఫీ తోటలు, వ్యవసాయం, భవన నిర్మాణ పనులు, ఫ్యాక్టరీలల్లోనూ, సెలూన్ షాప్‌లలో, సూపర్‌మార్కెట్‌లలో కొనసాగుతున్నారు. రాజధాని బెంగళూరుతోపాటు బెంగళూరు గ్రామీణ, మైసూరు, మడికేరి, మంగళూరు, బెళగావి ప్రాంతాలలో అత్యధికంగా వలసకార్మికులు ఉన్నారు.

వలసలు ఎందుకంటే...

ఆయా రాష్ట్రాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం, కర్ణాటకలో విస్తారమైన అవకాశాలు ఉండడమే ప్రధాన కారణంగా ఉంది. అంతేకాక సామాజికంగా వెనుకబడినవారికి భూమి లేకపోవడం మరో సమస్య. ఉత్తరాదిరాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతుండడంతో ఉపాధి కోసం వలస వస్తున్నారు.

ఇతర ప్రాంతాలవారిని పనిలో కుదుర్చుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. స్థానికులైతే సెలవులు, అధిక వేతనం డిమాండ్ చేస్తారు. ఉత్తరభారతీయులు ఏడాదికో సారి మాత్రమే సొంతూళ్లకు వెళ్తారు. పైగా వారికి 8గంటలు మాత్రమే పని చేస్తామనే షరతు పెట్టరు. తెల్లవారునుంచి అర్ధరాత్రిదాకా గానీ పనులు చేస్తారు. మరో వైపు వారికి వసతి, భోజనం కల్పిస్తే పనిచేసే చోటునే ఉండిపోతారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని కన్నడ సంఘాల పోరాటానికి ప్రభుత్వం కూడా స్పందించింది. అందుకు అనుగుణమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఆచరణలో సాధ్యం కావడం లేదనే విమర్శలు ఉన్నాయి.



భవన నిర్మాణ పనుల్లో..



డీసీఎం డీకేశితో మాజీ ఎంపీ సిద్దేశ్వర్, ఎమ్మెల్యే బీపీ సతీశ్

బీజేపీ రెబల్స్‌లో చీలిక..!

- యత్నాళ్ ఒంటరి కానున్నారా..?
- బహిరంగ విమర్శలకు దూరంగా ఉన్న నేతలు
- డీసీఎంతో ఆ ఇద్దరి భేటీపై జోరుగా చర్చలు

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బీజేపీలో రెబెల్ వర్గంలో ముసలం మొదలయ్యిందా అనే చర్చలు జోరందుకుంటున్నాయి. దాదాపు ఏడాదికాలంగా బీజేపీ సీనియర్ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్‌తో కలసి దాదాపు పదిమందికిపైగా ముఖ్యనేతలు రెబెల్స్‌గా మారారు. అనూహ్యంగా యత్నాళ్‌పై అధిష్టానం కఠిన చర్యలు తీసుకుంది. ఏకంగా ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసి ఆరేళ్లపాటు వేటు వేసింది. అప్పటిదాకా తరచూ సభలు, సమావేశాలు జరిపే రెబెల్ టీమ్ ఒక్కసారిగా గప్‌చుప్ అయిపోయింది. రెబెల్స్ టీమ్ భవిష్యత్తుకోసం ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను మార్చే అవకాశాలు లేదనిపిస్తోంది. యత్నాళ్ బృందం మినహా మిగిలినవారంతా విజయేంద్రకు అనుకూలంగా ఉన్నారు. ఒకరిద్దరు వ్యతిరేకమైనవారు ఉన్నా అనుకూలమైన అగ్రనేతలకు సమాచారం ఇవ్వడం మినహా బహిరంగంగా వ్యాఖ్యలు చేసే పరిస్థితుల్లో లేరు. యత్నాళ్ పక్కకు వెళ్లిపోవడంతో రెబెల్ బృందంలోని రమేశ్ జార్కిహోళి, అరవింద లింబావళి, జీఎం సిద్దేశ్వర్, కుమార బంగారప్ప, మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ, ఎమ్మెల్యే బీపీ హరీశ్ తదితరులు నిశ్శబ్దంగా అయిపోయారు. యత్నాళ్‌పై వేటు పడిన తర్వాత ఒకటిరెండుసార్లు మాత్రమే నామమాత్రంగా కలిశారు. అయితే భవిష్యత్తు నిర్ణయాలపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేకపోయారు. ఇలా సాగుతున్న తరుణంలోనే ఎమ్మెల్యే బీపీ హరీశ్, మాజీ ఎంపీ జీఎం సిద్దేశ్వర్ తాజాగా శనివారం డీసీఎం డీకే శివకుమార్‌ను భేటీ అయ్యారు. వీరి కలయిక ఆంతర్యం ఏమిటనేది అంతు చిక్కడం లేదు. విజయేంద్రతో ఢీ కొట్టినవారు ఆ పార్టీలో కొనసాగినా భవిష్యత్తు ఉండదని ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి బీజేపీ రెబెల్ టీమ్ ఒక్కసారిగా ఉనికి లేకుండా మారిపోయినట్లు తెలస్తోంది. డీసీఎం భేటీపై జోరుగా చర్చలు మొదలయ్యాయి.

బకాయిల పల్లెలు..!

- గ్రామీణ ప్రాంతాల్లో అరకొరగా పన్ను వసూళ్లు
- కంప్లి ఫస్ట్... బళ్లారి తాలూకా లాస్ట్
- కుంటుపడుతున్న అభివృద్ధి

8

కులరహిత సమాజమే ఆశయం..!

- విద్యతోనే కుటుంబం, సమాజ ప్రగతి
- మనుగడ సాధించేది శాస్త్రీయ సిద్ధాంతాలే
- తుమకూరు సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమాజం కులరహితం కావాలని, విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని సీఎం సిద్దరామయ్య అన్నారు. మా కుటుంబంలో ఆరుమంది పిల్లల్లో నేనొక్కడినే చదువుకుని ముఖ్యమంత్రి పదవి దాకా వచ్చానన్నారు. చదువుకు నిరంతరం విలువ ఉంటుందన్నారు. శనివారం తుమకూరులో కురుబ సాంస్కృతిక పరిషత్ తోపాటు పలు సంఘసంస్థల ఆధ్వర్యంలో కురుబ సమాజం - సాంస్కృతిక చర్చాగోష్ఠి కార్యక్రమంలో ఆయన 31 పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మన జ్ఞానం, ఆలోచనలలో స్పష్టత ఉండాలన్నారు. కర్మ సిద్ధాంతాన్ని ధిక్కరించి శాస్త్రీయంగా సిద్ధాంతపరంగా ఉంటేనే గులాం పద్ధతినుంచి బయటకు రావచ్చునన్నారు. గతంలో సంస్కృతం నేర్చుకుంటే శిక్షలు వేసేవారన్నారు. శూద్రులు విద్యావంతులై కవితలు, పుస్తకాలు రాస్తే వారిపై తప్పుడు ఆరోపణలు చేసేవారన్నారు. కాళిదాస, వాల్మీకిలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. కాళిదాసు నాలికపై బ్రహ్మ అనే అక్షరం రాసినందుకే గొప్ప సాహితీవేత్త అయ్యారనే మాటలు నమ్మరాదన్నారు. వాల్మీకి వేటాడేవారనేది నమ్మరాదన్నారు. బసవణ్ణ 850 ఏళ్లక్రితమే అనుభవ మండపాన్ని రూపొందించి సమసమాజ నిర్మాణం ఆశించారన్నారు. ఆర్థిక, విద్య ద్వారానే సమాజంలో ఎదుగుదల సాధ్యమన్నారు. కులరహిత సమాజం రాజ్యాంగ ఆశయమన్నారు. కానీ నేటికీ అస్పృశ్యత విద్యలో సమానత్వం లేకపోవడం బాధ కలిగించే అంశాలన్నారు. మనం విద్య సాధించడం స్వార్థం కోసం కాదని, అవకాశాలు లేని కులాలనుంచి ఎదుగుదల లక్ష్యం అయ్యామన్నారు. రాజ్యాంగం లేకుంటే మనకు విద్య లభించేది కాదన్నారు. బ్రహ్మ ఒకరికి విద్య, మరొకరికి నిరక్షరాస్యత రాయలేదని, ఒకరు శ్రీమంతుడు, ఒకరు పేదవారుగా ఉండాలని కోరలేదని, ఒకరికి పంచభక్ష్య పరమాన్నాలు, మరొకరు కడుపు మాడ్చుకోవాలని రాయలేదన్నారు. అహింద సమాజం ఎదగాల్సి ఉందన్నారు. సమాజంలో మార్పునకు విద్య ఒక్కటే బలమైన శక్తి అన్నారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, మాజీ మంత్రి రేవణ్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.



కురుబ సమాజం - సాంస్కృతిక చర్చాగోష్ఠి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

జారిపడినందుకే కాలికి గాయం..

సీఎం సిద్దరామయ్య కొన్ని నెలలుగా ఇబ్బంది పడుతున్న అంశాన్ని సన్నిహితులతో పంచుకున్నారు. తుమకూరులో ఆయన సన్నిహితులతో మాట్లాడిన వేళ ఎడమకాలు కొంచెం నొప్పిగా ఉందని అయితే కార్యక్రమానికి రావాల్సిందేనంటూ ఒత్తిడి తీసుకురావడంతో హాజరయ్యానన్నారు. ఎక్కువదూరం ప్రయాణించేందుకు సాధ్యం కావడం లేదన్నారు. బాత్రూంనుంచి బయటకు వచ్చినప్పుడు జారి పడ్డానన్నారు. 2005లో కబడ్డీ ఆడేవేళ లిగ్మెంట్ దెబ్బతిందని, ప్రస్తుతం అదే చోట నొప్పి వచ్చిందన్నారు. అందుకే ఎక్కువ తిరగడం లేదని, అవసరమైన కార్యక్రమాలకు మాత్రమే వస్తున్నా అన్నారు.

40లక్షల మంది ఉన్నా..7.5లక్షలే చూపారు

- కులగణనపై రెడ్డిసంఘం మండిపాటు

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికలో రెడ్డి కులస్తుల జనాభాను తక్కువగా చూపారని , రాష్ట్రంలో 40లక్షలమందిదాకా ఉన్నామని కేవలం ఏడున్నర లక్షలమందే చూపారని కర్ణాటక రెడ్డిజనసంఘం ప్రతినిధులు మండిపడ్డారు. ఉపాధ్యక్షులు వెంకటశివారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితర కార్యవర్గ సభ్యులతో శనివారం నగరంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్డి సామాజికవర్గం ఎంతమంది ఉన్నారనేది సంఘం ద్వారానే సర్వే చేపిస్తామన్నారు. మా సంఘం అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ రెడ్డి కులస్థులు ఉన్నారన్నారు. కానీ అంత తక్కువగా ఎలా చూపుతారన్నారు. మా ఆశయాలకు భంగం కలిగించేలా ప్రభుత్వం సిద్ధమైతే పోరాటం చేస్తామన్నారు. మంత్రి రామలింగారెడ్డితోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీలందరినీ కలసి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. ఆ తర్వాత పోరాటం చేస్తామన్నారు. సుమారు 450మందికిపైగా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో రెడ్డిజనసంఘం ప్రతినిధులు

పాహిమాం.. పవనపుత్రా..!

- ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం
- ప్రత్యేక పూజలకు తరలి వచ్చిన భక్తులు



అలంకరణలో ఆంజనేయస్వామి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హనుమాన్ నామస్మరణ మార్మోగింది తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామ పరిధిలోని గుమ్మనహళ్ళి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల భజనామండలుల ఆధ్వర్యంలో రోజంగా భజనలు సాగాయి. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా భక్తులు సమర్పించిన బియ్యం, కూరగాయలతో అన్నసంతర్పణలో రాగిముద్ద, పప్పుచారు చేయడం విశేషం. సాయంత్రం దేవరమళ్ళూ గ్రామ పురవీధుల్లో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవినీతికో రేటు..!

- సామాజిక తనిఖీల్లో అధికారుల చేతివాటం
- ప్రతి సోషల్ ఆడిట్‌కు రూ.30 వేలకుపైగా వసూలు
- నిధుల దుర్వినియోగ శాతం ఆధారంగా మరింత
- కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అధికారులు
- డ్వామా విజిలెన్స్ విభాగంలో అక్రమాల తతంగం


ఖాళీగా దర్శనమిస్తున్న విజిలెన్స్ విభాగం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్వామాలో వసూలు చేసుకున్న వారికి వసూలు చేసుకున్నంతా అన్నట్లుగా ఉంది పరిస్థితి. అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తే వాటిని పట్టించుకోకుండా మరింత మంచి పోస్టింగ్‌తో పొరుగు జిల్లాలకు పంపుతున్నారు. ఇందుకు ఉదాహరణ గతంలో విజిలెన్స్ విభాగంలో పనిచేసిన కీలక అధికారిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చాయి. అయితే ఆయనకు మరింత మంచి పోస్టింగ్ ఇచ్చి పొరుగు జిల్లాకు బదిలీపై పంపారు. ఆయన తరువాత ఇన్‌చార్జ్‌గా ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన్ను ఉత్సవ విగ్రహం చేసి డ్వామా పీడీ తరువాత స్థాయి అధికారి, హెచ్‌ఆర్ విభాగంలో ఉండే అధికారి అనధికారికంగా పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి పనులు, వాటర్ షెడ్ ఇతర డ్వామా పరిధిలో అమలు చేస్తున్న పథకాలలో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై నిర్వహించే సామాజిక తనిఖీలు ఈ ఇద్దరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఎక్కడ సామాజిక తనిఖీ నిర్వహించినా రూ.30 వేల నుంచి రూ. 50వేలు వారికి ఆయా మండల అధికారులు కట్టాల్సిందే. లేదంటే సామాజిక తనిఖీలో తేల్చిన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలకు ఉపక్రమిస్తారు. దీంతో ఆయా మండల ఉపాధి అధికారులు, అక్కడ పని చేసే సిబ్బంది అందరూ తలో చేయి వేసి సామాజిక తనిఖీ వేదికకు టోకెన్ చెల్లించేస్తారు. ఇక అక్కడితో ఆగరు. దుర్వినియోగమైన నిధుల శాతం ఆధారంగా మరో దఫా పైకం ఇచ్చుకోవాల్సిందే. డ్వామాలో నిఘా, హెచ్ ఆర్ విభాగాలకు చెందిన ఈ ఇద్దరు కీలక అధికారులే అవినీతి, అక్రమాలు ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్లను వాటాలుగా పంచుకుంటున్నారనే విమర్శలు ఆశాఖలో గట్టిగా వినిపిస్తున్నాయి. తాజాగా బుక్క రాయసముద్రం, రాప్తాడు, యల్లనూరు మండలాల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో డ్వామాలోని ఇద్దరు కీలక అధికారులకు రూ. లక్షలు ముట్టజెప్పినట్లు సోషల్ మీడియలో వైరల్ అయ్యింది. ఆయా క్లస్టర్ల ఏపీడీలు, ఆయా మండలాల ఏపీఓలు, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వసూళ్లకు దిగినట్లు సమాచారం.

ఇద్దరిదే కీలక పాత్ర

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాలలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలు ఉన్నాయి. గతంలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లిన ఓ అధికారి తిరిగి అదే స్థానానికి వచ్చి మునుపటి హవా సాగిస్తున్నారు. ఇందుకు ఇద్దరు అధికారులు బాగా సహకరిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఒకరు హెచ్‌ఆర్ విభాగం, మరొకరూ ద్వితీయ స్థాయి అధికారి కావడం గమనార్హం. విజిలెన్స్ విభాగంతో సంబంధం లేకపోయినా అన్నీ తానై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరై ఆయా మండలాల్లో వచ్చినంత పిండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్వామా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలలో వసూళ్ల పర్వం సాగుతోందనేందుకు ఇటీవల ఆయా మండలాల్లో వసూళ్లే నిదర్శనం. నిఘా, హెచ్‌ఆర్‌లలో ప్రతి ఫైల్‌కు ఓ రేటు నడుస్తోందని ఆశాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

17వ విడత సామాజిక తనిఖీలు పూర్తి

డ్వామా పరిధిలోని పథకాల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై విచారణ చేపట్టేందుకే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 17విడతల సామాజిక తనిఖీలు పూర్తి కాగా, ప్రస్తుతం 18, 19వ విడతలు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసి బాధ్యతగా వ్యవహరించాల్సిన నిఘా విభాగం అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో రూ.4కోట్లకు పైగా రికవరీ చేయాలని తేల్చారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల వరకు రికవరీ చేశారు. అయితే అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై చర్యలు శూన్యం. ముడుపులు పుచ్చుకుని కేసులు మాఫీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఆరు నెలల కాలంలో విజిలెన్స్‌కు సంబంధం లేని అధికారి అన్నీ తానై మండల స్థాయిలో జరిగే సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరు కావడం...హెచ్‌ఆర్ విభాగంతో కలిసి ముడుపులలో వాటాలు పంచుకోవడం డ్వామాలో చర్చకు తెరలేపింది.


ఇటీవల యల్లనూరులో నిర్వహించిన సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా అధికారులు

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఇందులో ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా నేరుగా నా దృష్టికి తేవచ్చు. ఎక్కడా ఒక్క పైసా కూడా ఆర్థికంగా లావాదేవీలు ఇందులో ఉండవు. ఇటువంటి వాటిని ఎవరూ ప్రోత్సాహించరు. సామాజిక తనిఖీల్లో తేల్చిన మొత్తాన్ని బాధ్యులు నుంచి రికవరీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటాం. క్లస్టర్లు, మండలాల వారిగా రికవరీపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. విజిలెన్స్ విభాగం నుంచి నిత్యం నిఘా ఉంటుంది.

-సలీంబాషా, డ్వామా పీడీ

నీరసించిన కాంట్రాక్టర్లు

- పల్లె పండుగ పనులకు మలి విడత నిధులు ఏవీ?
- పనులు చేసిన కాంట్రాక్టర్లలో ఆందోళన
- పర్సెంటేజీలు తీసుకున్న అధికారుల్లో గుబులు


పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పల్లె రోడ్ల పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో పల్లె ప్రజలు గుంతల రోడ్లపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనేపథ్యంలో టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరగానే పల్లె పండుగ పేరుతో గుంతల రోడ్లకు మోక్షం కల్గించేలా మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అలాగే అత్యవసరంగా నిర్మించాల్సిన చిన్నచిన్న రోడ్లను సైతం పూర్తి చేసేలా తగిన ప్రణాళిక తయారు చేయించింది. అందుకు అనుగుణంగా నిధులు కూడా విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్లలో కొత్త ఉత్సాహం వచ్చింది. నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది. పల్లె పండుగ పనులతో పాటు మరిన్ని పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు పూర్తికాకనే నిధులు కేటాయించడంతో ఇక బిల్లుల చెల్లింపులకు డోకా ఉండదని కాంట్రాక్టర్లు సంబరపడ్డారు. పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈక్రమంలో కొందరు అధికారులకు సైతం అడ్వాన్సుగా పర్సెంటేజీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో ఓ ఉన్నతాధికారి తనకు రావాల్సిన పర్సెంటేజీలు ముట్టడంతో ఫుల్ జోష్‌లో ఉన్నారన్న చర్చ జరుగుతోంది.

స్పీడ్‌కు బ్రేక్

ప్రభుత్వం మరోసారి నిధుల విడుదలకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో కాంట్రాక్టర్ స్పీడ్‌కు బ్రేక్ పడింది. ఇప్పటికే పూర్తిస్థాయిలో పర్సెంటేజీలు పుచ్చుకున్న అధికారుల్లో సైతం గుబులు మొదలైందన్న చర్చ జరుగుతోంది. కాంట్రాక్టర్ల కంట పడితే ఏమి అడుగుతారో.. ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక అధికారులు మొహం చాటేస్తున్న పరిస్థితి. కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే.. కొంత మంది కాంట్రాక్టర్లు బిల్లులు అయిన తరువాత మీ పర్సెంటీజీ సొమ్ము మీకు ఇస్తాం.. ప్రస్తుతానికి మేము ఇచ్చిన సొమ్ము మాకివ్వండి అనే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మంజూరైన సిమెంట్ రోడ్లను పరిశీలిస్తే..

జిల్లా వ్యాప్తంగా 1961 పనులకు అనుమతులు మంజూరయ్యాయి. రూ.105.05కోట్లతో 217.18 కిలోమీటర్ల పొడవు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అనుమతించిన పనుల్లో ఇప్పటికే 1750 పూర్తి అయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో 198 కిలోమీటర్ల పొడవున పనులు పూర్తి చేశారు. 15 పనులకు సంబంధించి కొత్తగా అనుమతులు మంజూరయ్యాయి. ఇవికాకుండా మొత్తం రూ.90 కోట్ల పనులకు జిల్లాలో శ్రీకారం చుట్టారు. వీటికి సంబంధించి రూ.24.88 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.80 కోట్ల వరకు కేవలం సీసీ రోడ్లకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది.

తారు రోడ్లను పరిశీలిస్తే..

జిల్లాలో మొత్తం 18 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. రూ.30.19 కోట్లు కేటాయించారు. ఇందులో 10.39 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి 4.86 కోట్ల నిధులు విడుదల చేశారు. 17.6 కిలోమీటర్లకు సంబంధించి నూతనంగా అనుమతులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

నిర్మాణ దశలో ఉన్న రోడ్లు


కల సాకారం!

- వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- రూ.48 కోట్లతో పనులు ప్రారంభం
- కణేకల్లు-ఉరవకొండ ప్రజలకు తప్పనున్న బాధలు
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం


బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు (ఫైల్)


నూతన బ్రిడ్జి ఏర్పాటుకు సిద్ధం అవుతున్న స్థలం

కణేకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజల నాలుగు దశాబ్దాల కల నెరవేరనుంది. మండల కేంద్రం నుంచి ఉరవకొండకు వెళ్ల దారిలో వేదవతి హగరిపై బ్రిడ్జి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేగాక రూ.48.42 కోట్లను మంజూరు చేసింది. దీంతో పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పయ్యావుల, కాలవ సమన్వయంతో..

టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగానే ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటుపై ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థికమంత్రిగా ఉండగా, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విప్‌గా ఉండటంతో వీరిద్దరి సమన్వయంతో బ్రిడ్జి ఏర్పాటుకు రూ.48.42 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ పనులను దక్కించుకుంది. గత ఏడాది అక్టోబరు 12న విప్ కాలవ శ్రీనివాసులు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

శిథిలావస్థలో హెచ్చెల్సీ అక్విడెక్ట్


శిథిలావస్థకు హెచ్చెల్సీ అక్విడెక్ట్

స్థానిక వేదవతి హగరిపై 1984లో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌ను నిర్మించారు. దీనిపై కణేకల్లు-ఉరవకొండ మధ్య వాహనాల రాకపోకలు సాగుతుండేవి. మూడేళ్ల కిందట అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరుకుందని హెచ్చెల్సీ అధికారులు రహదారిని మూసివేశారు. దీంతో ప్రయాణికులు దిగువగేరు మీదుగా ఉన్న హగరిలో కొన్ని రోజులు ఆటోలలో రాకపోకలు సాగించారు. కానీ వర్షం వచ్చినపుడు ఆ దారి కూడా కొట్టుకుపోయింది. దీంతో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌పైనే ఆటోలకు మాత్రమే అనుమతులు ఇచ్చి బస్సుల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో కణేకల్లుతో పాటు మాల్యం, కళేకుర్తి, సొల్లాపురం, హనుమాపురం, తుంబిగనూరు, గరుడచేడు తదితర గ్రామాలకు వెళ్లాలంటే అనేక అగచాట్లు పడాల్సి వచ్చింది.

సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం

కణేకల్లు- ఉరవకొండకు రోడ్డు సమస్యపై ప్రజాప్రతినిధులకు పలు సార్లు స్థానికులు వినతిపత్రాలు ఇచ్చి, బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో చర్చించి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఎన్‌డీపీ స్కీం కింద నిధులు మంజూరయ్యాయి. 1.9 కి.మీ. ఈ రహదారిలో 480 మీటర్లు బ్రిడ్జి కాగా మిగతాది స్థానిక అయ్యప్పస్వామి గుడి నుంచి కళేకుర్తి రహదారి వరకు డబుల్ రోడ్‌గా ఉంది. వేదవతి హగరిపై నిర్మించనున్న 480 మీటర్ల బ్రిడ్జి పొడవులో ఏడు మీటర్ల వెడల్పు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే పనుల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ ప్రాంతంలోని శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ అడ్డుగా ఉండడంతో దాన్ని షిఫ్టింగ్ చేసేందుకు కాంట్రాక్టర్లు అధికా రులకు ప్రతిపాదనలు పెట్టారు. అది పూర్తవ్వగానే పనుల వేగవంతం చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు.

మా గ్రామం కనుమరుగయ్యేది



రాష్ట్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోకపోతే మాగ్రామం కనుమరుగయ్యేది. ఎందుకంటే ఇప్పటికే ఈ ప్రాంతంలో బస్సుల రాకపోకలు లేక కళేకుర్తి రవాణా సౌకర్యానికి దూరంగా ఉంది. బస్సులన్నీ కణేకల్లులోని దిగువ గేరి నుంచి మాల్యం మీదుగా వెళుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మల్లి, మాజీ సర్పంచ్, కళేకుర్తి

పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి కాగానే..



కళేకుర్తి వద్ద నిర్మించనున్న బ్రిడ్జి కింది భాగంలో శ్రీరామిరెడ్డి పైప్ లైన్ ఉంది. ఇటీవల పనులు చేసేటపుడు పైపులైన్ అడ్డంకిగా మారడంతో దాన్ని పూర్తిగా ఇతర చోటికి షిఫ్టింగ్ చేయాలని నిర్ణయించాం. ఇందు కోసం రూ.రెండు కోట్లు ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా షిఫ్టింగ్‌కు ప్రయత్నాలు చేస్తున్నారు. పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి అయిన వెంటనే బ్రిడ్జి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

-రవిశంకర్‌రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ, రాయదుర్గం

విద్యార్థులకు అనుకూలం

మా గ్రామం నుంచి ప్రతి రోజూ దాదాపు వంద మంది విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్తుంటారు. ఐదు కి.మీ. దూరం కణేకల్లుకు ప్రయాణించాలంటే గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. బ్రిడ్జి ఏర్పాటైతే బస్సులన్నీ మా ఊరి మీదుగానే వెళతాయి. దీంతో విద్యార్థులకు కూడా బస్సు సౌకర్యం ఉండటంతో పాటు రవాణా సౌకర్యాలు కూడా మెరుగుపడతాయి. అలాగే ప్రజలు కూడా ఇబ్బంది పడకుండా ఉంటారు.

-మారెన్న, కళేకుర్తి

గూడు చెదిరిన గువ్వలు..!

అదిగదిగో... అక్కడ..
పచ్చరంగులో కనిపిస్తోందే అదే చిలుక..
ఇదిగో.. ఇక్కడ..
తెల్లగా
కనిపిస్తోందే
అది కొంగ
ఇటు
చూడూ..
ఆ కొమ్మపై
కూర్చుని కుహు
కుహూ
అంటోందే నల్ల పక్షి అదే కోయిల
ఇలా.. కొన్నేళ్ల కిందట పల్లెల్లో పసి
పిల్లలకు పెద్దలు చెప్పేవారు.
చెరువులు, కుంటలు, వాగులు, వంకల
వద్ద చెట్ల కొమ్మలపై చేరి ఉదయం,
సాయం సంధ్య వేళల్లో ఆ పులుగులు
చేసే కిలకిలరావాలు ఎంతో
ఆహ్లాదంగా ఉండేది.
ఇదంతా గతం
ప్రపంచీకరణ, సాంకేతిక
పరిణామాలతో అనేక పక్షి జాతులు
అంతరించిపోతున్నాయి.
కిలకిలరావాలు మాయమైపోయాయి.
ప్రస్తుతం పిల్లలకు ఫలానా పక్షి ఎలా
ఉంటుందంటే కంప్యూటర్‌లోనో లేక
సెల్‌ఫోన్‌లోనో చూపించాల్సిన
పరిస్థితి ఏర్పడిందని పక్షి ప్రేమికులు
ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- అంతరించిపోతున్న పక్షిజాతులు
- ఆందోళనలో పక్షి ప్రేమికులు
- అడవులు, చిరుధాన్యాలు తగ్గిపోవడమే కారణమా?
- పంటలకు పురుగుమందుల వాడకంతో మృత్యువాత

తనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగు దశాబ్దాల కిందట కనిపించిన అనేక పక్షి జాతులు నేడు అంతర్ధానం అయ్యాయి. గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా కనిపించే కాకులు, గద్దలు, పిచ్చుకలు, కొంగలు కూడా తగు స్థాయిలో కనిపించడం లేదు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు కూడా పక్షుల రక్షణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలోనే మండలంలో పనిచేస్తున్న జనజాగృతి స్వచ్ఛంద సంస్థ వివిధ సంస్థలతో కలిసి పక్షి జాతుల లెక్కింపు సర్వే కార్యక్రమం చేపట్టింది. ఇందులో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఎన్నో రకాల పక్షి జాతులు అంతరించిపోతున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోంది. వేగంగా పెరుగుతున్న జనాభా కారణంగా గ్రామాల చుట్టూ ఉన్న కొండలు, గుట్టలు, వాగులు, వంకలు వ్యవసాయ భూములుగా మారిపో యాయి. విచ్చలవిడిగా రైతులు ఉపయోగిస్తున్న పురుగు మందులు కూడా పక్షి జాతులు అంతరించిపోవడానికి ప్రధాన కారణమని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. పట్టణాలు ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో పట్టణాల చుట్టూ ఉన్న పెద్ద వృక్షాలను సైతం తొలగిస్తున్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా ఎన్నో ఏళ్లనాటి వృక్షాలు సైతం నేల కూలుస్తున్నారు. దీంతో గూడు చెదిరిన పక్షులు కాలక్రమేణ అంతరించిపోతున్నాయి.


సర్వే చేస్తున్న జనజాగృతి టీమ్

రసాయన ఎరువులతో చేటు

గ్రామాల్లో గతంలో నవధాన్యాలు, చిరు ధాన్యాలు సాగుచేసేవారు. పురుగుమందులు, రసాయనిక ఎరువులు వినియోగం ఉండేదికాదు. దీంతో పక్షి జాతులకు కావలసిన ఆహారం పుష్కలంగా పంట పొలాల్లో లభించేది. పురుగుమందులు వాడకపోవడంతో పక్షులకు కావలసిన పురుగులు లభించేవి. వంకలు, వాగులు, కుంటలు, చెరువుల్లో ఏడాది పొడవునా నీరుండేది. నీరు, ఆహారం పుష్కలంగా ఉండటం, భారీ వృక్షాల ఆవసంతో పక్షి సంతతి కూడా బాగా వృద్ధి చెందేది. ప్రస్తుతం వందలాది అడుగుల లోతు బోరుబావులు తవ్వుతున్నారు. దీంతో వంకలు, వాగులు, బావులు, కుంటల్లో సైతం వర్షం పడిన నెల, రెండు నెలల్లోపే నీరు ఇంకిపోతోంది. దీంతో పక్షి జాతులకు నీటి కరువు ఏర్పడుతోంది. వేసవిలో విచ్చలవిడిగా కొండలు, గుట్టలకు నిప్పు పెడుతుండటంతో అక్కడ కూడా రక్షణ లేక అనేక పక్షి జాతులు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి అనేకానేక కారణాలతో పక్షి జాతులు అంతరించపోతున్నాయన్నది వాస్తవం. పక్షి జాతులను సంరక్షించకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పక్షిప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలు, అడవుల్లో పక్షులు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన ప్రాంతాల్లో ఎత్తైన మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.


చిన్నరామన్నగారిపల్లి వద్ద అరుదైన బ్లాక్‌స్టోరక్ పక్షి



95శాతం పక్షులు.. పురుగులనే తింటాయి



95 శాతం పక్షులు పురుగులు తినే జీవిస్తాయి. 5శాతం పక్షులు మాత్రమే గింజలు, కాయలు తింటాయని పక్షుల పరిశోధకుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అశోక్ తెలిపాడు. నల్లమాడకు చెందిన ఈయన బీటెక్ చదివి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే వారంలో రెండురోజులపాటు అడవుల్లో సంచరిస్తూ, వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే మన ప్రాంతంలో బట్టమేక పిట్ట, కలిమికోడి కనిపించడం లేదని వెల్లడించారు. ప్రభుత్వాలు వీటికోసం నిధులు ఖర్చు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా మన ప్రాంతంలో కనిపించని బ్లాక్‌స్టోరక్ పక్షి ఇటీవల తనకల్లు మండలంలోని చిన్నరామన్నగారిపల్లి వద్ద కనిపించినట్లు పేర్కొన్నారు. ఇది అరుదైన పక్షి అని కాపాడుకోవాల్సి ఉందన్నారు.

-అశోక్, పక్షుల పరిశోధకుడు, నల్లమాడ

కాకులు, పిచ్చుకలు కూడా అంతరించిపోతున్నాయి



మాచిన్నప్పుడు గ్రామంలో ఏపుగా పెరిగిన చింత, వేపచెట్లు ఎక్కువగా ఉండేవి. చెట్ల నిండా కాకులు నివాసముండేవి. ప్రతి ఇంటిలోనా ఎక్కడో ఒకచోట పిచ్చుకుల స్థావరాలుండేవి. నేడు కొట్టాల స్థానంలో కాంక్రీటు మిద్దెలొచ్చాయి. గ్రామంలోని ఎత్తైన చెట్లను కొట్టేశారు. ఈకారణంగా పక్షులు ఆవాసాలు కోల్పోవడంతో అవి అంతరించిపోతున్నాయి. నేటి యువతకు పక్షి జాతుల పట్ల కనీస అవగాహన లేదు. పాఠ్యపుస్తకాల్లో పక్షి జాతుల గురించి తెలియజేయాల్సి ఉంది.

- రెడ్డిశేఖర్ రెడ్డి, మల్లిరెడ్డిపల్లి

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం



ప్రజల్లో పక్షులు, వన్యప్రాణుల పట్ల సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వాటికి కావలసిన స్థావరాల కోసం గ్రామాల వద్ద అడవుల్లో మొక్కల పెంపకం చేపడుతు న్నాం. పక్షి జాతులు లెక్కింపు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకూ 208 పక్షి జాతులను గుర్తించాం. ఇంకా గుర్తించాల్సినవి ఉన్నాయి. ప్రభుత్వాలు కూడా పక్షి జాతుల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాల్సి ఉంది.



- రామ్ ప్రసాద్, సీఈఓ, జనజాగృతి

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొంచ్...

అడాల్ఫ్ హిట్లర్ (జయంతి)



ప్రపంచ చరిత్రలో నియంతకు మారుపేరుగా నిలిచిన అడాల్ఫ్ హిట్లర్ 1889 ఏప్రిల్ 20న ఆస్ట్రియాలో జన్మించారు. 1933 నుంచి జర్మనీ ఛాన్సెలర్‌గాను, 1934 నుంచి మరణించేంతవరకు 'జర్మనీ నేత' (ఫ్యూరర్)గా వ్యవహరించారు. నేషనల్ సోషలిస్టు జర్మన్ వర్కర్స్ పార్టీ (నాజీ పార్టీ) వ్యవస్థాపకులు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత నిస్తేజంగా ఉన్న సైనిక వ్యవస్థను గాడిలోకి తెచ్చారు. రెండో ప్రపంచయుద్ధంతో 1.10 కోట్లమంది మృతి చెందగా వీరిలో 60లక్షలమంది యూదులు ఉన్నారు. దీనిని చరిత్రలో 'మానవ హననం' (హోలోకాస్ట్)గా పేర్కొంటారు. శత్రువులనుంచి కాపాడుకునేందుకు 1945 ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నారు.

త్రిపురనేని మహారథి (జయంతి)



సినిమాలో పంచ్ డైలాగులకు పేరొందిన త్రిపురనేని మహారథి 1930 ఏప్రిల్ 20న కృష్ణా జిల్లా పామర్రులో జన్మించారు. అసలు పేరు త్రిపురనేని బాలగంగాధర రావు. తెలుగు సినీ మాటల రచయిత. స్క్రీన్‌ప్లే, డైలాగ్, స్క్రిప్ట్ రైటర్‌గా పేరొందారు. కృష్ణ నటించిన 'అల్లూరి సీతారామరాజు' సినిమాకు మాటలు రాయడంతో గుర్తింపు పొందారు. ఇలా 150 సినిమాలకు సంభాషణలు అందించారు. తదుపరి రాజకీయాలపై ఆసక్తితో వెనుకబడిన వర్గాలు, కులాల, తెగలు, మైనారిటీల, మహిళా, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా 2006లో త్రిలింగ ప్రజా ప్రగతి పార్టీని స్థాపించారు. 2011 డిసెంబరు 23న కన్నుమూశారు.

పళని సుబ్రమణియ పిళ్ళై (జయంతి)



కర్ణాటక సంగీతకారుడిగా పేరొందిన పళని సుబ్రమణియ పిళ్ళై 1908 ఏప్రిల్ 20న జన్మించారు. పాల్ఘాట్ మణి అయ్యర్, రామనాథపురం సీఎస్ మురుగ భూపతిలతో కలసి మృదంగ త్రయంగా పేరొందారు. మృదంగం, కంజీర వాయించడంలో నిష్ణాతులు. తండ్రి పళనిముత్తయ్య పిళ్ళై వద్దనే శిష్యుడిగా చేరి రాణించారు. ట్రావెన్‌కోర్‌కు 'ఆస్థాన విద్వాన్'గా వ్యవహరించారు. ప్రొఫెసర్‌గా సేవలందించారు. పలు పురస్కారాలు పొందారు. 1962 మే 27న తుదిశ్వాస వీడారు.

ఎంఎస్ రామయ్య (జయంతి)



మత్తికెరె సంపంగి (ఎంఎస్) రామయ్య 1922 ఏప్రిల్ 20న తుమ కూరు జిల్లా మధుగిరిలో జన్మిం చారు. విద్యావేత్త, పారిశ్రామి కవేత్త, మానవతావాది. దూర దృష్టితో పలు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. ఆయన ప్రారంభించిన 'గోకుల విద్యాసంస్థ' కాలక్రమంలో ఎంఎస్‌ఆర్ ఐటీగా పలు విభాగాలతో అభివృద్ధి చెంది బెంగళూరులోనే కాక కర్ణాటక రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గడించింది. 'తాయ్నాడు' దినపత్రిక, గోకుల వార పత్రిక, కైలాస మాసపత్రికలను నిర్వహించారు. వెనుకబడిన వర్గాల లక్షలాదిమంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. అంతేకాక కైవారలో యోగి నారేయణ తాతయ్య ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలకు కృషి చేశారు. 1997 డిసెంబరు 25న కన్నుమూశారు.

చంద్రబాబు నాయుడు (పుట్టినరోజు)



సీబీఎన్‌గా పేరొందిన తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు 1950 ఏప్రిల్ 20న చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రైతు కుటుంబంలో జన్మించారు. ప్రస్తుతం ఏపీ సీఎంగా కొనసాగుతున్నారు. 1995 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019వరకు ఇలా 14ఏళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్‌కు తొలి సీఎంగా వ్యవహరించారు. పలు మంత్రిత్వశాఖలతోపాటు కీలక హోదాలలో కొన సాగారు. ఐటీ రంగానికి ఊతమిచ్చారు.

రాజీవ్ మీనన్ (పుట్టినరోజు)



రాజీవ్ మీనన్ 1963 ఏప్రిల్ 20న కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జన్మించారు. సినిమా డైరెక్టర్‌గా రాణించారు. 1994లో మణిరత్నం రూపొందించిన 'బాంబే' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పేరొందారు. ఆ తర్వాత గురు, కాదల్ సినిమాలకు కూడా పని చేశారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలకు దర్శకత్వం, సినిమాటోగ్రఫీ చేశారు. మళయాళ సినిమాలో నటించారు. సొంత ప్రొడక్షన్స్ ద్వారా డాక్యుమెంటరీలు, ప్రకటనలు, సినిమాలకు అవసరమైన సామగ్రిని సమకూరుస్తున్నారు.

ధార్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, నైతిక విలువలు పాటించడం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని యణ్ణంగూరు గ్రామంలో సోమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, యోగి నారేయణ యతీంద్ర దేవాలయాల కుంభాభిషేకం, ఆర్చ్ ప్రారంభంలో పాల్గొని మాట్లాడారు. యువతకు రామాయణం, మహాభారతం, భగవద్గీత, భాగవతం బోధనల ద్వారా మన సంస్కృతిని పరిచయం చేయాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన నియోజకవర్గాలలో ఒకటైన శిడ్లఘట్ట పరిధిలో గత ఏడాది అవధిలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్, బీఆర్ అంబేద్కర్ భవన్, నౌకరరభవన్, గురుభవన్ నిర్మాణాలు ప్రగతిదశలో ఉన్నాయన్నారు. తాలూకా బీజేపీ అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ మాట్లాడుతూ యువతపై పెద్దల ప్రభావం ఉంటుందన్నారు. క్షీణిస్తున్న సంస్కారం, గురువులు, పెద్దలపట్ల గౌరవభావం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవితంలో ఆడంబరాలకు బదులు సరళత ముఖ్యమన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లా శరణసాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు రుద్రేశమూర్తి మాట్లాడుతూ యణ్ణంగూరు గ్రామానికి చరిత్ర ఉందని కైవార యోగినారేయణ తాతయ్య ఇక్కడ సంచరించారన్నారు. కార్యక్రమంలో పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు బంకు మునియప్ప, డైరెక్టర్ కే మంజునాథ్, మాజీ డైరెక్టర్ సీవీ నారాయణస్వామి, తాదూరు రఘు, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో వందలోపు ర్యాంకులలో 'నారాయణ' విద్యార్థులు



ర్యాంకులు పొందిన విద్యార్థుల బృందం

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో బెంగళూరు సహకారనగర్ సింధుభవన్ నారాయణ విద్యార్థులు ర్యాంకులు పండించారు. జాతీయస్థాయి ఓపెన్ కేటగిరీలో వందలోపు రెండు ర్యాంకులను సాధించినట్టు డీన్ నాగరాజు శనివారం తెలిపారు. ఆలిండియా 81వ ర్యాంకును మాతంగి పార్థసారథి, 84వ ర్యాంకులో రతన్ ఎస్ భగవతిలు ఉన్నారన్నారు. వెయ్యిలోపు 13మంది ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. నారాయణ గ్రూప్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ ప్రత్యేక సందేశం అభినందించారు. ఉత్తమర్యాంకులు సాధించిన వారిని ప్రశంసించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములయ్యారు.

ఉపాధి కార్మికులకు కూలి పెంపు



ఈఓ రమేశ్

బాగేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు కూలిమొత్తాన్ని స్వల్పంగా పెంచినట్టు కార్యనిర్వాహక అధికారి జీవీ రమేశ్ తెలిపారు. ఇదివరకు రూ.349గా ఉండగా ఇటీవల రూ.370కు పెంచారన్నారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాగేపల్లి, చేళూరు తాలూకాలలో 28 గ్రామ పంచాయతీలలో వందరోజులు పని కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. చెరువులు, నీటి కాలువలు, వాగులకు అనుబంధమైన నిర్మాణాలకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కాగా వ్యక్తిగతంగా నిర్మించి వ్యవసాయ కుంట, పశువుల పాక, వానపాముల పెంపకం తొట్టె వివిధ నిర్మాణాలకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. వలసలను నివారించి గ్రామాలలోనే ఉపాధి కల్పించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఉపాధి పనులకు సంబంధించి గ్రామపంచాయతీ కార్యాల యాలలో అర్జీలు ఇస్తే తగిన అవకాశం కల్పిస్తామన్నారు. కాగా ఎండలు అధికమ వుతున్న తరుణంలో కార్మికులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఉపాధి పనులు నిర్వహించే చోట తగిన నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కల్పించేలా గ్రామపంచాయతీలు చర్యలు తీసుకుంటాయన్నారు. సుదీర్ఘకాలం తర్వాత ఉపాధి హామీ కూలి మొత్తాన్ని పెంచారన్నారు.

గోవులను రక్షించిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు



పశువుల వాహనాలతో బజరంగ్‌దళ్ కార్యకర్తలు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా కసాయిఖానాకు తరలిస్తున్న విషయాన్ని గుర్తించిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు రక్షించారు. తాలూకాలోని దిబ్బూరహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్యాచరణ సాగింది. రక్షించిన 38 ఆవులను సమీపంలోని గుడిబండ తాలూకా నడువనహళ్ళి సమీపంలోని నమ్మనాడు గోశాలకు పోలీసుల సమక్షంలో అప్పగించారు. మిట్టేమరి - చింతామణి మార్గంలో నాలుగు బొలెరో గూడ్స్ వాహనాలలో గోవులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. బజరంగ్‌దళ్ జిల్లా సంచాలకులు గరుడాచార్లహళ్ళి అమరేశ్ మాట్లాడుతూ జిల్లాలో కసాయిఖానాలకు పశువును అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసుల సహకారంతో పట్టుకున్నామన్నారు. ఈనెల 10న పెరేసంద్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా సాగిస్తున్న 19 ఆవులను రక్షించామన్నారు. ప్రస్తుతం 38 ఆవులను రక్షించగలిగామన్నారు. గోమాంసం నిషేధం ఉన్నా దర్జాగా కొనసాగుతోందని విచారం వ్యక్తం చేశారు. గోవధ నిందితులకు కఠినశిక్షలు విధిస్తేనే అడ్డుకట్ట సాధ్యమన్నారు. ఇందుకు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ సంఘాల నేతృత్వంలో ఉమ్మడి పోరాటానికి సిద్ధమన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ తాలూకా ఉపాధ్యక్షుడు లక్ష్మీసాగర సంతోష్, భజరంగ్‌దళ్ కన్వీనర్ గగన్, సహ సంచాలకులు రాహుల్, సతీశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. గోవులను రక్షించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠకులకు కన్సొలేషన్ ప్రైజ్‌ల పంపిణీ



పాఠకుడు నాగరాజ్‌కు బహుమతి అందిస్తున్న జీఎం, డీసీఎంలు

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చందాదారులకు 'కార్ అండ్ బైక్ రేస్'లో దక్కిన కన్సొలేషన్ ప్రైజ్‌లను బెంగళూరు కార్యాలయంలో పంపిణీ చేశారు. బనశంకరి ప్రాంత పాఠకుడు కేవీఆర్ నాగరాజ్‌కు జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్, డీసీఎం బాబా ఫక్రుద్దీన్‌ల సమక్షంలో ప్రముఖ వైద్యుడు బాలాజి అందచేశారు. హెచ్ఏఎల్ ప్రాంత పాఠకురాలు సీతామాలక్ష్మి తరపున మనవడు అభిరాంకు ప్రముఖ రియల్టర్ ప్రభాకర్ అందచేశారు. బన్నేరుఘట్ట ప్రాంత పాఠకురాలు జీహెచ్ శ్రీలక్ష్మికి బ్యూరో ఇన్‌చార్జ్ ఎం రవి కన్సొలేషన్ బహుమతిని అందించారు. వైట్‌ఫీల్డ్‌కు చెందిన కేవీ పవన్ కుమార్‌కు అకౌంటెంట్ ఎం రామచంద్ర బహుమతిని అందచేశారు.



అభిరాంకు అందచేస్తున్న రియల్టర్ ప్రభాకర్



పవన్‌కుమార్‌కు అందచేస్తున్న అకౌంటెంట్ రామచంద్ర



శ్రీలక్ష్మికి బహుమతి అందచేస్తున్న బ్యూరో ఇన్‌చార్జ్ ఎం.రవి

చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం



చెరువు అభివృద్ధి పనుల ప్రారంభంలో ప్రముఖులు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా ఏ మేడహళ్ళిలోని మాదవన చెరువును ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ రూ.12.12 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. సురజక్కనహళ్ళి గ్రామ పంచాయతీలోని చెరువులో పూడిక తీసే పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు మునికృష్ణప్ప లాంఛనంగా ప్రారంభించారు. చెరువు సమితి అధ్యక్షుడు రాజేంద్ర, ఉపాధ్యక్షుడు మధు, సంయుక్త కార్యదర్శి సంపంగి, కోశాధికారి హరీశ్, సమితి సభ్యులు , ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడి చేసిన అటవీ అధికారి సస్పెన్షన్

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలోని పాత్రికేయుడిపై దాడికి పాల్పడిన అటవీశాఖ అధికారి దస్తగిరిసాబ్‌ను సస్పెండ్ చేస్తూ సబ్ డివిజనల్ అటవీశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. పాత్రికేయుడిపై దాడికి సంబంధించి కథనాలు, వీడియోలు హల్‌చల్ కావడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు సమగ్ర వివరాలు సేకరించారు. గురువారం బీదర్ జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు నిరసన తెలిపారు. అనుచితంగా వ్యవహరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈమేరకు అటవీ శాఖ అధికారిని సస్పెండ్ చేశారు.

22న మెగా జాబ్‌మేళా

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న హిందూపురంలోని బాలాజీ విద్యావిహార్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. జాబ్‌మేళాలో 20 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం జి. గుడ్డం పల్లికి చెందిన సుబ్బరాయప్పను హత్యచేసిన కేసులో అదే గ్రామానికి చెందిన నంజయ్యగౌడ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ అంజనేయులు తెలిపారు. నీ భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని కొన్నాళ కిందట నంజయ్యగౌడ్‌తో సుబ్బరాయప్ప అన్నాడు. అది నిజమని నమ్మి నంజయ్యగౌడ్ మద్యం తాగివచ్చి భార్యను చిత్రహింసలు పెట్టేవాడు. విసిగిపోయిన ఆమె నంజయ్యగౌడ్‌ను వదిలేసి బెంగళూరు వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఆయన ఒంటరిగా ఉన్నాడు. గ్రామంలో కూడా ఆయన్ను పట్టించుకునేవారు కాదు. ఈ తరుణంలో ఈనెల 15న మద్యం సేవించి సుబ్బరాయప్ప ఇంటివద్దకు వెళ్లి 'నీవు చెప్పిన మాటలు విని నా భార్యను కొట్టడంవల్లే వెళ్లిపోయింది' అని గొడవపడ్డాడు. కోపంతో అక్కడే ఉన్న ఇటుకపెల్లలు తీసుకుని సుబ్బరాయప్ప తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబసభ్యులు బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నంజయ్యగౌడ్‌ను శనివారం గోళ్లాపురం పారిశ్రామికవాడలో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

నేడు 'శ్రమకావ్యం' పుస్తక గానసభ

హాజరు కానున్న సుద్దాల అశోక్ తేజ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐద్వా, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ, యూటీఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ హాలులో 'శ్రమకావ్యం' పుస్తక గాన సభ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సమాజ అభివృద్ధిలో శ్రమ మార్పు, ఆధునిక కాలంలో దాని గొప్పతనం, అసమానతలతో కూడిన నేటి సమాజం ఎలా మారుతుందో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ 'శ్రమకావ్యం' పుస్తకం రూపంలో వివరించారని అన్నారు. త్వరలో మేడే రానున్న నేపథ్యంలో ఆదివారం నిర్వహించనున్న పుస్తక గాన సభకు గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వీ నాయుడు, తిరుపాలు, బాలరంగయ్య, వీరరాజు, పరమేష్, చంద్రిక, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



నూతనంగా ఏర్పాటైన హైమాస్ లైట్‌లు, సీసీ కెమెరాలు

చేళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రముఖ కూడళ్లలో సీసీ కెమెరాలు, హైమాస్ లైట్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో, పోలీస్ స్టేషన్ ఎదురుగా, కందుకూరు మార్గంలో, వాసవిసత్రం వద్ద, బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేశారు. చింతామణి నుంచి బాగేపల్లి, చాకవేలు మార్గాలను అనుసరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు. పట్టణానికి నాలుగు ప్రముఖ కూడళ్లతోపాటు ఇతర ప్రాంతాలలో సీసీ కెమెరాల నిఘా కొనసాగుతుందన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడమే తొలి ప్రాధాన్యత అని, ఒకవేళ చోటు చేసుకుంటే నిందితుల ఆచూకీ గుర్తించేందుకు సీసీ కెమెరాల నిఘా దోహదపడుతుందన్నారు.

గ్యారెంటీలతో స్వాభిమాన జీవనం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి


బంగారపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధిదారులు స్వాభిమాన జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని కామసముద్ర గ్రామం జానుగుట్టె సర్కిల్‌లో వివిధ గ్రామాల రహదారుల డాంబరీకరణకు రూ.10కోట్లతో శంకుస్థాపన చేసి మాట్లాడారు. కేజీఎఫ్ మార్గంలోని రోడ్డు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపకళ శశిధర్ ఎంతమేర రోడ్లను అభివృద్ధి చేస్తారో గమనించి మిగిలిన రోడ్లను డాంబరీకరణ చేయనున్నట్టు తెలిపారు. తాలూకావ్యాప్తంగా ప్రజలకు పశుపక్ష్యాదులకు తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా మాజీ ఎంపీ మునిస్వామి చేసిన గోమాళ, గుండుతోపు, చెరువుల ఆక్రమణలు ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బూదికోటె బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, కామసముద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆదినారాయణకుట్టి, తొప్పనహళ్ళి గ్రామపంచాయతీ ప్రభాకర రెడ్డి, కేతగానహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మంజుళ శ్రీనివాస్, దోణిమడగు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మంజుళ జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా...



నామఫలకాలు ప్రారంభంలో ప్రముఖులు

మహదేవపుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వీధివ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని వీరికి అండగా భారతీయ సేవా సమితి ఉంటుందని సమితి అధ్యక్షుడు హరాడి చిన్నరామచంద్ర పేర్కొన్నారు. వీధి వ్యాపారులను ప్రైవేట్ సంస్థలు దౌర్జన్యానికి గురి చేయడాన్ని వీధి వ్యాపారుల సమాఖ్య ఖండిస్తోందన్నారు. నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్ లోని బెన్స్ రోడ్డు, మణిపాల్, టాస్కో, గోపాలన్, ఎస్‌జేఆర్ రోడ్డు తదితర ప్రాంతాల రోడ్లకు నామఫలకాలను ప్రారంభించి మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో స్థానిక వ్యాపారులు లైసెన్స్‌లు పొందారన్నారు. 20ఏళ్లకు పైగా వీధివ్యాపారులు ఇక్కడే కొనసాగుతున్నారని వారికి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమర్, కార్మిక విభాగం అధ్యక్షుడు అంజినప్ప, కృష్ణప్ప, నారాయణస్వామి, మునిరాజు, ఆటో శ్రీనివాస్, యశోదమ్మ, పరిమళ, అనుసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.53	1,578.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	424	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	381	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.02	3.87



మంటల్లో కాలిపోతున్న లారీ

పశుగ్రాసం లారీ దగ్ధం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం రవాణా చేస్తున్న లారీ మంటల్లో కాలిపోయింది. శనివారం తెల్లవారుజామున కూడ్లిగి తాలూకా శివపూర్ సమీపంలోని హైవే 50 పై పశువుల మేతతో ప్రయాణిస్తున్న లారీ అకస్మాత్తుగా బోల్తా పడి మంటలు చెలరేగాయి. బాగల్‌కోట నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ శివపూర్ సమీపంలోకి రాగానే అధిక బరువు కారణంగా బోల్తా పడింది. వెంటనే మంటలు చెలరేగాయి. అయితే డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది లారీ ఎక్కి మంటలను ఆర్పారు. పీఎస్ఐ ప్రకాశ్, అతని సిబ్బంది సంఘటనా స్థలాన్నిసందర్శించి పరిశీలించి వన్ వే ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎవ్వరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డుపైనే ధాన్యం కుప్పలు



రోడ్డుపై ఆరబోసిన వరిధాన్యం

గంగావతి రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) రోడ్డుపైనే వరి ధాన్యం కుప్పలు ఆరబోస్తుండంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గంగావతి, లింగసుగూరు రహదారి పై రైతులు వరి ధాన్యాన్ని పలు గ్రామాల్లో ఆరబోశారు. తిప్పనాల్, సులేకల్, అరలిహల్లి, కేసరహట్టి, హిరూరు గ్రామాల నుంచి గంగావతి కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్ళే 20కి.మీ.తారు రోడ్డుపై అధికంగా ఆరబోసుకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున్న రైతులు కల్లాల్లో ఆరబోసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మోకా స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారిరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని మోకా పోలీస్‌స్టేషన్‌ను శనివారం బళ్లారి ఎస్పీ శోభారాణి తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ శోభారాణికి స్టేషన్ ఎస్ఐ కాళింగ నేతృత్వంలో గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్‌లో పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేష్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐలు కాళింగ, నరసింహ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. చిలమత్తూరు మండలానికి చెందిన వ్యక్తితోపాటు హిందూపురానికి చెందిన రామాంజి, నేతాజీనగర్ మంజుళ, మారుతిని అరెస్ట్‌చేసి వారి నుంచి 205 విస్కీ టెట్రాప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బకాయిల పల్లెలు..!

- గ్రామీణ ప్రాంతాల్లో అరకొరగా పన్ను వసూళ్లు
- కంప్లి ఫస్ట్... బళ్లారి తాలూకా లాస్ట్
- అభివృద్ధి కుంటుపడుతుందంటున్న అధికారులు



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో పన్ను వసూళ్ల సవ్యంగా ఉన్నప్పటికీ, పల్లెల్లో బకాయిలు పేరుకు పోవడం అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో పన్ను వసూళ్ల భేషుగ్గా ఉన్నా, కొన్ని ప్రాంతాల్లో అరకొరగానే ఉన్నాయి. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ళలో 77.47శాతం సాధించగా, అందులో కంప్లి తాలూకా 100శాతం వసూలు చేసి ముందువరసలో ఉండగా, 70.23శాతం పన్నువసూలు చేసిన బళ్ళారి తాలూకా జిల్లాలో ఆఖరి స్థానంలో నిలిచిందని జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్ సుమేర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదు తాలూకాలు ఉండగా, బళ్ళారి తాలూకాలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు, సండూరులో 26, కంప్లిలో 10, కురుగోడు, 12, సిరుగుప్పలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం మీద 100 గ్రామ పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ సంగ్రణ 14.05కోట్లు ఉండగా, ప్రస్తుతం 10.86కోట్ల వసూళ్ల అయ్యాయని, ఇంకా రూ.3కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. రెవెన్యూ ఆదాయం పెంచడానికి జిల్లా పంచాయతీ అధికారులు ప్రతి వారం వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా గ్రామ పంచాయతీ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. రెవెన్యూ సంగ్రహణలో లక్ష్యాన్ని చేరుకోని గ్రామ పంచాయతీ అధికారి, సిబ్బందిని పిలిచి వారికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. దీని పరిణామంగా జిల్లాలో 77శాతానికి పైగా సాధన చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో జాగృతి అభియాన నిర్వహిస్తున్నట్లు, రెవెన్యూ వసూళ్ళ గురించి ప్రజలకు జాగృతి కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



బళ్లారి జిల్లా జడ్పీ కార్యాలయం



మహ్మద్ హ్యారీస్, జడ్పీ సీఈఓ

ఎందుకు బకాయిలు..?

కొన్ని గ్రామ పంచాయతీల వ్యాప్తిలో కొత్త కొత్త లేఔట్‌లు పుట్టుకొస్తున్నాయి. వాటి ద్వారా రెవెన్యూ ఆశించిన స్థాయిలో వసూళ్ళు కావడం లేదు. మరోవైపు ప్రజలు అందుబాటులో లేకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోవడం లేదనే సమాధానాలు అధికారుల నుండి వినిపిస్తున్నాయి. కొంతమంది పన్ను చెల్లించడానికే ముందుకు రావడం లేకపోవడం ప్రస్తుతం సమస్యాత్మకంగా మారిందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంవత్సరం ప్రారంభంలో జిల్లా పరిధిలో గ్రామీణ ప్రజలు ఉపాధి నిమిత్తం నగరాలకు వలస వెళ్తుంటారు. వలసలను అరికట్టడానికి ఉపాధి హామి పథకం వైపు అధికారులు, సిబ్బంది ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ వసూళ్ళ కుంటుపడడానికి మరో కారణంగా చప్పవచ్చని అధికారుల వాదన. రెవెన్యూ సంగ్రహణలో లక్ష్య సాధనలో బళ్ళారి తాలూకా వెనుకబడినా రెవెన్యూ మొత్తం ఇతర తాలూకాలతో పోలిస్తే ధరలు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం బళ్ళారి తాలూకా పరిధిలో రూ 3.53 కోట్ల రూపాయలు ఇతర తాలూకాలతో పోలిస్తే అధికమని చెప్పవచ్చు. జిల్లాలో ఖరీఫ్ పంటల కోతదశలో ఉన్నాయని, కోతలు పూర్తిఅయిన రైతులు, వ్యవసాయ కార్మికులతోపాటు వ్యవసాయాన్నే ఆధారంగా బతుకుతున్న కార్మికులకు చేతుల్లోకి డబ్బు చేరుతుందిన అపుడు రెవెన్యూ వసూళ్ళకు సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

పాలసంఘంలో అవినీతిపై విచారణ జరపాలి

- మెగా డెయిరీ బళ్లారిలోనే నిర్మించాలి
- విజయనగర రైతుల వాదన అసందర్భం: ఎమ్మెల్సీ వైఎం సతీష్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం రాయచూర్, బళ్లారి,కొప్పళ, విజయనగరం జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో (కేఎంఎఫ్) తీసుకున్న నిర్ణయాలు నిబంధనలకు విరుద్ధమని, వాటిపై విచారణ జరపాలని జిల్లా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శాసనమండలి సభ్యుడు వై.ఎం.సతీశ్ మాట్లాడుతూ సమాఖ్యలో ఎన్నికలు నిర్వహించడానికి బళ్లారి జిల్లాకు కూడా నాలుగు డైరెక్టర్ పదవులు అవసరమన్నారు. దీనికి సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే విజయనగరం జిల్లాలో పాల ఉత్పత్తిదారుల సంఘాలు అధికంగా ఉన్నందున ఆ జిల్లాకు ఆరుసీట్లు అవసరమన్నారు. అదేవిధంగా ప్రధాన కార్యాలయం , మెగా డెయిరీ అక్కడే ఉండాలనే వాదన సరైనది కాదు. గతంలో బళ్లారి జిల్లాలో 110 సొసైటీలు ఉండగా, విజయనగరంలో కేవలం 80మాత్రమే ఉండేవి. బళ్లారి జిల్లాలో తగ్గుదలకు కారణమైన బోర్డు వైఖరిని పరిశీలించాలన్నారు. బళ్లారి జిల్లా అత్యధికంగా పాలను వినియోగిస్తుంది కాబట్టి మెగి డెయిరీ, దాని ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే ఉండడం సముచితమన్నారు. బళ్లారిలో మెగా డెయిరీకి స్థలాన్ని కూడా గుర్తించారని, ఈ సమయంలో విజయనగరం జిల్లాకు మార్చాల్సిన అవసరం లేదన్నారు. వారు కోరుకుంటే వేరే ఏదైనా చేయనివ్వండి, దీనికి సంబంధించి సహకార మంత్రికి లేఖ రాశానని, ఆయన తగిన నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలోని బళ్లారి, హవేరీ, దార్వాడ్ యూనియన్లు నష్టాల్లో ఉన్నాయన్నారు. గత డిసెంబర్‌లో ఈ యూనియన్‌లోని పాల ఉత్పత్తుల నాణ్యతను తనిఖీ చేసినప్పుడు అనేక లోపాలుబయటపడ్డాయన్నారు. యూనియన్‌కు సరఫరా చేసే పాలు కూడా కల్తీ అని దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. యూనియన్‌లో పాలనా వైఫల్యం ఉందని యూనియన్ మాజీ అధ్యక్షుడు హనుమంతప్ప అన్నారు. యూనియన్ మాజీ డైరెక్టర్ వీరశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మెగా డెయిరీ స్థాపన కోసం కోళగల్లులో స్థలాన్ని ఎన్‌డీడీబీ ఆమోదించిందన్నారు. భీమనాయక్ రెండు జిల్లా మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడు. హొసపేటలో రైతుల నిరసనను అసరగా చేసుకున్నారని ఆరోపించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్ నాయుడు, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైఎం సతీశ్

పార్క్ అభివృద్ధికి భూమి పూజ

శాసన మండలి సభ్యుడు వై.ఎం. సతీశ్ నగరంలోని వాజ్‌పేయి లేఅవుట్‌లోని అనేక పార్కులలో ఒకదానిని అభివృద్ధికి రూ. 40లక్షలతో శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులు బాగుంటే అవి దైనందిన జీవనశైలికి ఉపయోగపడుతాయని అన్నారు. ఈసందర్భంగా కార్పొరేషన్ సభ్యులు సురేఖ, కెఎస్.అశోక్‌కుమార్, మాజీ సభ్యుడు మల్లనగౌడ, బీజేపీ నాయకులు హనుమంతప్ప, జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు, స్థానిక నివాసితులు, చెన్నన్‌గౌడ్, శశిధరమేటీ, శంకర మూర్తి,భీమయ్య స్వామి, సురేశ్ చౌదరి, కుమారస్వామి, రవిస్వామి,బసవ రాజు, హలుగప్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అధికారులు అవగాహన కల్పించారు. శనివారం నగరంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో జిల్లా అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపక , అత్యవసరసేవల విభాగం ప్రాంతీయ అగ్నిమాపక అధికారి తిమ్మారెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అసుపత్రులు, అత్యవసర ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మంటలను ఆర్పడంపై అవగాహన కల్పించారు. జిల్లా అగ్నిమాపక అధికారి హనుమన్‌గౌడ, పోలీస్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14నుండి 20వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక సేవా వారోత్సవాలను జరుపుకుంటామని, అగ్నిమాపక భద్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి మాక్‌డ్రిల్ నిర్వహిస్తామన్నారు. జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి నేతృత్వంలోని అగ్నిమాపక అధికారుల బృందం, జిల్లా ఆసుపత్రి బృందం ఆకట్టుకునేలా మాక్ డ్రిల్ ప్రదర్శించారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఉపయోగించగల అగ్నిమాపక యంత్రాలు, అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశం నుండి సురక్షితమైన ప్రవేశానికి తరలించడం,ప్రథమ చికిత్స, ఇతర చర్యలపై ఆ మాక్ ప్రదర్శన సమగ్ర సమాచారాన్ని అందించింది. ఈసందర్భంగా జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేష్‌బాబు, జిల్లా ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురునాథ్ బి.చౌహాన్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్పనవర్, జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, అగ్నిమాపక కేంద్రం అధికారి దయానంద గౌడ, జిల్లా ఆసుపత్రి అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దేశాయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విమలాక్షి, స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య అధికారులు, నర్సింగ్ సిబ్బంది,సబార్డినేట్ పాల్గొన్నారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ప్రాంతీయ అధికారి తిమ్మారెడ్డి



బాధితులను తరలించడంపై అవగాహన

జేఈఈ మెయిన్స్‌లో బెస్ట్ విద్యార్థుల ప్రతిభ



సయ్యద్ అశ్వక్



పవన్‌కుమార్



మహీర్



లిఖిత



జైకిషన్ పటేల్



అఫిఫా అంజుమ్



సాయి హర్షిత



శ్రీనివాస్‌నాయక్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో నగరానికి చెందిన బెస్ట్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన విద్యార్థులు సయ్యద్ అశ్వక్ 98.22, పవన్‌కుమార్ 97.52, మాహిర్ 95.90, లిఖితా 95.58, జై కిషాన్ పాటిల్ 94.60, అఫిఫా అంజుమ్ 92.57, సాయి హర్షితా 89.08, శ్రీనివాస్‌నాయక్ 89.01 పర్సంటైల్‌తో ఉత్తీర్ణత చాటారు. ఈవిద్యార్థులను బెస్ట్ సంస్థ అధ్యక్షుడు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్, కార్యదర్శి శ్రీ మన్నె శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కే.వెంకటేశ్వరావ్, ఉప ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వర్గం అభినందించారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- అదనపు ఎస్పీకి కురుబసంఘం నాయకుల వినతి



ఏఎస్పీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కురుబ సంఘం నాయకులు

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని వినాయక్ నగర్ ఓ హోటల్లో ఒకచిన్న ఘర్షణ జరిగి పది రోజులయినా నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ కురుబ సంఘం శనివారం ఆందోళన చేపట్టింది. అనంతరం అదనపు ఎస్పీ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కురుబ సమాజానికి చెందిన కురుబ సంఘం జనరల్ సెక్రటరీ దారం మిల్ మోహన్ కుమారులు, హోటల్ యజమాని అరుణ్‌కుమార్, తేజ , రవికుమార్ పై అదే ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది దాడి చేశారు. తల, చేతులు, కాళ్లపై ఇనుప రాడ్, కర్రలతో కొట్టారు. ఈసంఘటనకు సంబంధించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే పది రోజులు గడిచినా పోలీసులు ఒక్కరిని మాత్రమే అరెస్టు చేశారు.మిగిలిన ఆరుగురిని ఇప్పటికీ అరెస్టు చేయలేదు. దీనిపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గాదిలింగన గౌడ, మాట్లాడుతూ తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన అదనపు ఎస్పీ రవికుమార్ రాబోయే 24గంటల్లో మిగిలిన నిందితులను అరెస్టు చేసెందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కురుబ సంఘం నాయకులు భారీగా తరలివచ్చారు.

జోరుగా వరికోతలు



వరికోతల్లో నిమగ్నమైన రైతు

సిరుగుప్ప, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా వరికోతలు జోరందుకున్నాయి. సిరుగుప్ప తాలుకాలో ఈ ఏడు వరిని అధికంగా సాగు చేశారు. దిగుబడి కూడా అధికంగా వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాలుకా వ్యాప్తంగా ట్రాక్టర్లు, కోతమిషన్లకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు 50 నుంచి 60 బస్తాల ధాన్యం వస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ధాన్యానికి సరైన ధర లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్ వరి పంట క్వింటాల్ రూ. 2030 నుంచి రూ. 2070 వరకు ధర పలుకుతుండగా, కావేరీసోనా రూ. 1800 నుంచి రూ. 1870 వరకు ధర పలుకుతున్నాయి. గత యేడాది ఆర్ఎన్ఆర్ వరికి ఎక్కువ డిమాండ్ వుండేది. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి ప్రతిష్టాత్మక ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత పరీక్ష ద్వారా ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి కే రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం కోసం విద్యార్థులు ఏప్రిల్ 19 నుంచి హోస్పేట, కూడ్లిగి, హరప్పనహళ్లిలోని తాలుకా షెడ్యూల్డ్ కుల సంక్షేమ అధికారుల కార్యాలయాలు, హగరి బొమ్మనహళ్లిలోని హూవిన హడగలిలోని సాంఘీక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ అధికారుల కార్యాలయాల నుండి దరఖాస్తులను పొందవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మే 3 చివరి తేదీ అని అన్ని పత్రాలతో తాలుకాలోని షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారులు, సహాయ డైరెక్టర్ల కార్యాలయాలకు, సాంఘీక సంక్షేమ శాఖకు కార్యాలయ పనివేళల్లో సమర్పించవచ్చు. దరఖాస్తు చేసుకునే 60 శాతం మార్కులతో 5వ తరగతి ఉత్తీర్ణులై వుండాలి. కుటుంబ వార్షిక ఆదాయం 2.50 లక్షలు లోపు వుండాలన్నారు.

హోసూరు జోన్



కొవ్వొత్తుల ర్యాలీలో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు

'నీట్' బాధిత విద్యార్థులకు నివాళి

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): 'నీట్' కుంభకోణం కారణంగా ఇంతవరకు మృతి చెందిన 22మంది విద్యార్థుల జ్ఞాపకార్థం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. శనివారం అన్నాడీఎంకే విద్యార్థి విభాగం, యువజన, మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, పన్నీర్‌సెల్వం ముఖ్యులుగా పాల్గొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడరాదన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

ధర తగ్గిన పుదీన.. తోటలకు ఎరువుగా..!



పుదీన పంటకు రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

హోసూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో పండిస్తున్న పుదీనా పంటకు ధర తగ్గడంతో చాలామంది రైతులు పుదీనాను తమ తోటలకు ఎరువుగా వాడుకుంటున్నారు. కొన్ని నెలల క్రితం వరకు పుదీనా కట్ట రూ.30-50 వరకు పలికింది. ప్రస్తుతం దిగుబడి పెరిగి డిమాండ్ తగ్గడంతో కట్ట కేవలం రూ.3 మాత్రమే పలుకుతోంది. దీంతో ఆందోళన చెందిన రైతులు పుదీనా పంటను తోటలకు ఎరువుగా వాడేస్తున్నారు. పుదీనా ఒకసారి నాటితే కొన్ని నెలలపాటు వస్తుంది. దీంతో రైతులు పెద్దసంఖ్యలో పుదీనా సాగు చేస్తున్నారు. ఇటీవల ధర ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో రైతులలో ఆందోళన నెలకొంది. పుదీనా పంట నిల్వకు తగిన చర్యలు చేపట్టడంతోపాటు గిట్టుబాటుధర కల్పించే చర్యలు చేపట్టాని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి శ్రీవాసవి విద్యాయంలో శనివారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా ఇన్నర్‌వీల్ అధ్యక్షుడు శ్రీమతి శిల్ప మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు సమయం వృథా కాకుండా, పుస్తక పఠనంపై ప్రోత్సహించడానికే పుస్తకాలు అందజేశా మన్నారు. పుస్తకాలతో పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ పుస్తకాల్లో పిల్లల మేథో వికాసానికి సహాయపడే అంశాలు ఉన్నాయన్నారు. శ్రీ వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీ విఠ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ కేవలం సామాజిక సేవ గురించి మాత్రమే కాదు, కరుణ, సహకారం, ప్రేరణకు నమూనా అన్నారు. పిల్లల అభివృద్ధికి దోహదపడే ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. విద్యార్థులందరూ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని విద్యా సాంస్కృతిక సహాయ కార్యకలాపాలను చేపడుతామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఇన్నర్ వీల్ కార్యదర్శులు రచన, కోశాధికారి శ్రీమతి భారతిపాటిల్, శ్రీమతి ఇందిరా, సభ్యులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు శిల్ప